క్లుప్తంగా

నేత్రాల సేకరణ

జనగామ రూరల్: పట్టణంలోని గిర్నిగడ్డ ప్రాంతానికి చెందిన కె.అరుణ (70) గుండెపోటుతో ఆదివారం మరణించింది. భర్త మాధవరెడ్డి అనుమతితో లయన్స్ క్లబ్ ఆఫ్ జనగామ ఆధ్వర్యంలో ఆదివారం నేత్రాలను సేకరించారు. వాటిని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ గంగిశెట్టి ప్రమోద్‌కుమార్, ఉప్పలయ్య, కృష్ణ జీవన్, బాబు, రామలింగారెడ్డి, నరేంద్రరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సుదర్శనం, తదితరులు పాల్గొన్నారు.

కళాశాలను మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలి



లింగాలఘణపురం : ప్రభుత్వ జూనియర్ కళాశాలను మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని కోరుతూ ఆదివారం ఎంపీపీ చిట్ల జయశ్రీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాజయ్యకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కళాశాల ఏర్పాటుకు కావాల్సిన మౌలిక వసతులను కల్పిస్తే మండల కేంద్రంలోనే ఏర్పాటు చేసేందుకు హామీ ఇస్తున్నానని, అదేవిధంగా భవిష్యత్‌లో కళాశాల భవన నిర్మాణానికి కూడా స్థలం కేటాయించాలని సూచించారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాసు, పీఏసీఎస్ చైర్మన్ శ్రీశైలం, టీఆర్ఎస్ జిల్లా నాయకుడు ఉపేందర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మల్లేశం, గ్రామశాఖ అధ్యక్షుడు యాదగిరి, దిశ జిల్లా సభ్యురాలు భాగ్యలక్ష్మి, ఉన్నారు.

అభివృద్ధికి సహకరించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులకు పార్టీలకతీతంగా అందరూ సహకరించాలని ఘన్‌పూర్ ఎంపీటీసీ, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గన్ను నర్సింహులుగుప్తా అన్నారు. డివిజన్ కేంద్రంలోని బస్టాండ్ సమీపంలోని రెడ్డిమెస్ రోడ్డు నుంచి వనం రాజు ఇంటి వరకు ఎస్ఎఫ్‌సీ నిధులు రూ.2.50 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్ఎఫ్‌సీ నిధులతో సీసీరోడ్డు నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గోనెల ఉపేందర్ ముదిరాజ్, వార్డుసభ్యుడు నరేందర్, రాజు, రవి పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

పాలకుర్తి టౌన్: ఫిబ్రవరి 15 నుంచి 20 వరకు బీహార్ రాష్ట్రంలో పాట్నాలో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ 11వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్‌రాజా ఒక ప్రకటనలో తెలిపారు. మహాసభలో జాతీయ రాజకీయాలతో పాటు తెలంగాణ రాజకీయ పరిస్థితులు, పార్టీ నిర్మాణంపై చర్చించనున్నట్లు తెలిపారు.

ప్రత్యేక శిక్షణ తరగతులు

పాలకుర్తి : జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రభుత్వ 10వ తరగతి విద్యార్థులకు నైతిక పరిజ్ఞాన పెంపుకోసం వందేమాతర ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తామని ప్రభుత్వ ఉపాధ్యాయుడు రామకృష్ణ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. మార్చి 4న నైపుణ్యత నిరూపించే పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.టాలెంట్ విద్యార్థులకు ప్రత్యేక ప్రోత్సాహం ఉంటుందన్నారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠాపన

జనగామ రూరల్: జిల్లా కేంద్రంలోని హన్మకొండ రోడ్ మూల బావి శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో సీతారామచంద్ర స్వామి, శ్రీరామనాథ (శివాలయం) గణపతి, సుబ్రమణ్య విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఉందని దేవాలయ ప్రధాన అర్చకులు మోహన్‌కృష్ణ భార్గవ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30 ,31, ఫిబ్రవరి 1 వరకు మూడు రోజుల పాటు యజ్ఞాలు ఉంటాయన్నారు. 25 మంది వేద పండితులతో ప్రతిష్ఠాపన ఉంటుందని,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దేవతా మూర్తుల అనుగ్రహం పొందాలని కోరారు.

బీఎన్ఆర్‌కేఎస్ కమిటీ

దేవరుప్పుల : భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం ధర్మగడ్డ గ్రామ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులుగా సూరారపు యాకన్న, ఎర్రబెల్లి విజయ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా వాంకుడోతు యాకుబ్, ప్రచార కార్యదర్శిగా మామిడి సైదులు, కోశాధికారిగా ఎర్రబెల్లి వినోద్‌కుమార్‌తోపాటు పలువురు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసి సంఘటితగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.

5 నుంచి భక్తోత్సవాలు

కొడకండ్ల : ఫిబ్రవరి 5 నుంచి 8 వరకు మండలంలోని పెద్దబాయితండ శివారులోని శ్రీ సీతా రామాంజనేయస్వామి ఆలయంలో అధ్యయన, భక్తోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ పుస్కూరి మోహన్‌రావు తెలిపారు. 5న సాయంత్రం తొలక్కం, 6న నవకలశ స్నపనము, సమ్మాశ్వార్ పరమపదోత్సవం, 7న విశ్వశాంతి హోమం, పూర్ణాహుతి,సీతా రాముల కల్యాణం, 8న పల్లకి సేవ ఊరేగింపు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

తాగునీటికి పడరాని పాట్లు

- నిరుపయోగంగా జీపీ మినరల్ వాటర్ ప్లాంట్లు
- కొనసాగుతున్న ప్రైవేటు ప్లాంట్ల హవా
- నిర్లక్ష్యంగా పంచాయతీ అధికారులు



ఛాగల్లులో నిరుపయోగంగా ఉన్న వాటర్‌ప్లాంట్

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని వివిధ గ్రామాల్లో తక్కువ ధరతో ప్రజలకు మినరల్ వాటర్ అందించే లక్ష్యంగా గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో గతంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్లు ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. స్వచ్ఛమైన తాగునీటి కోసం ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. జీపీ అధికారులతో పాటు సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో వాటర్‌ప్లాంట్ల నిర్వాహకులు కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా మినరల్ వాటర్ అంటూ ప్యూరిఫైడ్ వాటర్‌ను అందిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు ఈ విషయాన్ని పట్టించుకోకుండా చోద్యం చూస్తుండగా ఇదే అదనుగా ప్రైవేటు ప్లాంట్ల యజమానులు సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని శివునిపల్లిలో, ఛాగల్లులో, తానేదార్‌పల్లిలో దాదాపు 14 ఏళ్ల క్రితం జీపీల ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. మొదట్లో జీపీకి చెందిన ప్లాంట్ల వద్ద 20 లీటర్ల వాటర్ క్యాన్‌ను రూ.3 నుంచి రూ.5 వరకు విక్రయించేవారు. అయితే దాదాపు ఆరేళ్లుగా జీపీల ప్లాంట్లు పంచాయతీ అధికారులు, నిర్వాహకుల నిర్లక్ష్యంతో మూతపడ్డాయి. దాంతో విధిలేని పరిస్థితుల్లో ప్రజలు ప్రైవేటు మినరల్‌వాటర్‌పైనే ఆధారపడుతున్నారు. ప్రైవేటు వారు రూ.10 నుంచి రూ.15 వరకు విక్రయిస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా దాదాపు 70కి పైగా ప్రైవేటు వాటర్‌ప్లాంట్లు ఉన్నాయంటే దందా ఏ స్థాయిలో సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. ఏ ఒక్క వాటర్‌ప్లాంట్ కూడా ఐఎస్ఐ ప్రమాణాలు పాటించడం లేదు. మండలంలోని పలు వాటర్‌ప్లాంట్లలో నీటిని కనీసం శుద్ధి చేయకుండానే అమ్మకాలు చేస్తున్నారు. ప్లాంట్ల నిర్వహణపై కనీస అవగాహన లేకుండానే నీటిని తూతూమంత్రంగా శుద్ధి చేస్తూ సరఫరా చేస్తుండగా ప్రజల ఆరోగ్యానికి రక్షణ లేకుండా పోయింది. సంబంధిత రసాయనాలను ఇష్టారాజ్యంగా కలుపుతున్నారు. సరైన మోతాదులో కలుపకపోవంతో ఈ నీటిని తాగినవారంతా మోకాళ్లు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. చాలాచోట్ల జనరల్ వాటర్‌నే నామమాత్రంగా శుద్ధి చేసి ప్యూరిఫైడ్ వాటర్‌గా అమ్ముతున్నారు.అధికారులు స్పందించి మూతపడ్డ వాటర్‌ప్లాంట్లను వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.



శివునిపల్లిలో మూతపడిన జీపీ వాటర్‌ప్లాంట్

ఘనంగా కంఠమహేశ్వరస్వామి ఉత్సవాలు



పూజలో పాల్గొన్న గౌడ కులస్తులు

స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని మీదికొండలో గౌడ కులస్తుల ఆరాధ్యదైవమైన శ్రీ కంఠమహేశ్వర స్వామి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. నాలుగురోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జలాభిషేకం పూజలు, పుట్టగమ్ముట కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు ప్రత్యేకంగా అలంకరించిన బిందెలలో నీళ్లు తెచ్చి శ్రీ రేణుక ఎల్లమ్మ, కంఠమహేశ్వరస్వామి దేవాలయం వద్ద జలాభిషేకం, పూజలను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. గ్రామ గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు పొన్నం లక్ష్మణమూర్తి గౌడ్, ఉపసర్పంచ్ పొన్నం రంజిత్‌గౌడ్ మాట్లాడారు. ప్రతి ఐదేళ్లకోసారి నిర్వహించే ఉత్సవాలను ఈనెల 28 నుంచి 31 వరకు చేపడతామన్నారు. 30న ఉదయం 10 గంటలకు శ్రీ కంఠమహేశ్వర స్వామికి బోనాలు, మధ్యాహ్నం ఒంటి గంటకు శ్రీ రేణుకా ఎల్లమ్మ పట్నాలు, సాయంత్రం 6 గంటలకు రేణుకా ఎల్లమ్మ బోనాలు, రాత్రి 11.14 నిమిషాలకు కల్యాణమహోత్సవం, 31న కుల బంధువులకు విందు కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో తాళ్లపెల్లి చిన్నగట్టయ్య, మాచర్ల శ్రీను, పొన్నం రాజు, రమేష్, అందె అనీల్, మహేందర్, రాములు, వెంకట్రాజ్యం, పాల్గొన్నారు.

అసెంబ్లీలో సమస్యలు ప్రస్తావించాలంటూ వినతి

జఫర్‌గఢ్ : ఫిబ్రవరి 3 నుంచి జరుగనున్న అసెంబ్లీ సమావేశాల్లో అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను ప్రస్తావించాలని కోరుతూ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు మచ్చ శారద నేతృత్వంలో హన్మకొండలోని ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యకు ఆదివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో 70 వేల మంది అంగన్‌వాడీ ఉద్యోగులు పని చేస్తున్నారన్నారు. వీరు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి చాలిచాలని వేతనాలతో పని చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వ అంగన్‌వాడీలకు కనీస వేతనం చెల్లించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ బాధ్యులు రాజేశ్వరి, రాజకళ, ఉమ, లక్ష్మిబాయి, నాగలక్ష్మి, సరితతో పాటు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేస్తున్న శారద

అందుబాటులో లేని అధికారులు



పంటను పరిశీలిస్తున్న రైతు సంఘం మండల సహాయ కార్యదర్శి బాల్‌నర్సయ్య

బచ్చన్నపేట : వరి పంటలకు మొగి పురుగు ఆశించి పంటలను నాశనం చేస్తుంటే రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన వ్యవసాయ అధికారులు మాత్రం అందుబాటులో లేరని రైతు సంఘం మండల సహాయ కార్యదర్శి కొత్తపల్లి బాల్‌నర్సయ్య అన్నారు. ఆదివారం మండలంలోని చిన్నరామన్‌చర్లలో రైతుల పంటపొలాల వద్దకు వెళ్లి నష్టపోయిన వరి పంటలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల కళ్ల ముందే తమ పంటలు నాశనం అవుతుంటే తోచిన మందులను పిచికారి చేసినా ఫలితం లేకపోతుందన్నారు. వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పంటల నష్టాన్ని నివారించడానికి రైతులకు సలహాలు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు అన్నెబోయిన శ్రీనివాస్, పాల్గొన్నారు.

అత్యాచార నిందితుడి అరెస్టు

చిల్పూరు: మండలంలోని దేశాయితండా పంచాయతీ పరిధిలోని సీతతండాకు చెందిన అత్యాచార నిందితుడు భూక్య రెడ్డిని ఆదివారం చిన్నపెండ్యాల బస్ స్టేజీ వద్ద అరెస్టు చేసినట్లు జనగామ రూరల్ సీఐ సంతోష్, ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు. తండాకు చెందిన మతిస్థిమితంలేని యువతిని అత్యాచారం చేసి గర్భవతిని చేశాడు. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి అతని కోసం గాలింపు చేపట్టినట్లు తెలిపారు. ఆదివారం ఉదయం చిన్నపెండ్యాల బస్‌స్టేజీవద్ద బస్‌కోసం ఎదురు చూస్తున్నట్లు పక్కా సమాచారం అందడంతో వెంటనే అతన్ని అరెస్టు చేసినట్లు తెలిపారు.



బస్టాప్ వద్ద నిందితుడిని అరెస్టు చూపిస్తున్న సీఐ సంతోష్, ఎస్సై వినయ్‌కుమార్

నిరుపేదలకు బాసటగా నిలవాలి

దేవరుప్పుల : నిలువనీడ లేని నిరుపేదల కోసం క్లబ్ సభ్యులు బాసటగా నిలవాలని లయన్స్ క్లబ్ జీఎస్‌టీ కో ఆర్డినేటర్ పుట్ట హరికిషన్‌రెడ్డి సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ చాప్టర్‌మెంబర్ మర్రి పట్టాభిరాంరెడ్డి తల్లి తారకమ్మ జ్ఞాపకార్థం నిరుపేదలకు దుస్తుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యంతోపాటు దాతల సహకారంతో సమాజ హితం కోసం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గడ్డం సత్తిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఈదునూరు రామచంద్రారెడ్డి, మాజీ అధ్యక్షుడు ఈదునూరి నరసింహారెడ్డి, ఉప్పల్ రెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్ క్లబ్ కార్యదర్శి మధుసూదన్, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

యాదవ సంఘం అభివృద్ధికి కృషిచేస్తా

చిల్పూరు : గ్రామంలోని యాదవ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని అందులో భాగంగా సంఘానికి కమ్యూనిటీ హాల్ లేదా ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని రాజవరంలో ఆదివారం శ్రీమల్లికార్జున స్వామి శ్రీరేణుకాఎల్లమ్మ పట్నాల కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కుల సంఘానికి చెందిన ఉప సర్పంచ్ సంతోష్, కన్నెబోయిన కొంరయ్య, కుమార్, రమేష్, కృష్ణయ్య, శ్రీశైలం, వెంకన్న, రా జులు ఘనస్వాగతం పలికారు. అనంతరం పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా గ్రామానికి చేరుకోగానే సర్పంచ్ మారేపల్లి తిరుమలకృష్ణమోహన్‌రెడ్డి, ఎంపీటీసీ మారేపల్లి లలితశ్యాంకుమార్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు లింగారెడ్డి, నాయకులు తాళ్లపల్లి సమ్మయ్య, జనగాం యాదగిరి, ఇల్లందుల విజయ్, భూక్య స్వామి నాయక్, జక్కుల రాజయ్య, సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.



ఎల్లమ్మ పట్నాల కార్యక్రమంలో పాల్గొన్న కడియం

ఆలయ అభివృద్ధికి సహకరించాలి

బచ్చన్నపేట : మండలంలోని కొడవటూర్ శ్రీ సిద్ధేశ్వర ఆలయ అభివృద్ధికి పలువురు దాతలు సహకరించాలని సర్పంచ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గంగం సతీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆలయ ఆవరణలో 2023లో మహాశివరాత్రికి ఆలయంలో నిర్వహించే బ్రహ్మోత్సవాల సందర్భంగా సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల గురించి అన్ని గ్రామాల్లో ప్రచారాన్ని నిర్వహించి వాల్‌పోస్టర్లను అతికించాలన్నారు. ఉత్తరద్వార మెట్లకు దాత చంద్రకళ గ్రానైట్ అందించడానికి ముందుకు వచ్చారన్నారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి, మండల అధ్యక్షుడు బొడిగం చెంద్రారెడ్డి, ఆలయకార్యనిర్వాహణాధికారి వంశీ, ఆలయ ప్రధాన పూజారి ఓం నమశివాయ, మహాశివుడు, జూనియర్ అసిస్టెంట్ చల్ల రాజేందర్‌రెడ్డి, లక్ష్మికాంత్‌రెడ్డి, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్ సతీష్‌రెడ్డి

సమాజ హితానికి పాటుపడాలి

దేవరుప్పుల : ఓనమాలు నేర్చుకున్న విద్యానిలయం రుణం తీర్చుకునేలా పూర్వవిద్యార్థులు సమాజ హితం కోసం పాటుపడాలని ప్రజాప్రతినిధులు పోతిరెడ్డి బెత్లీనాలీనారెడ్డి, దుబ్బాక కవిత రత్నాకర్ రెడ్డి సూచించారు. ఆదివారం మండలంలోని కడవెండి హైస్కూల్‌లో 2002–2003 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల అపూర్వ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. బాల్య స్మృతులను నెమరువేసుకుంటూ ఆత్మీయతను చాటుకున్నారు. అనంతరం విద్య నేర్పిన గురువులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట : మండలంలోని పోచన్నపేట ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించుకున్నారు. స్థానిక సెకండరీ పాఠశాలలో చదువుకున్న 2005–2006 ఎస్ఎస్‌సీ విద్యార్థులు మండల కేంద్రంలోని లిమ్రా గార్డెన్‌లో సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. ముందుగా పాఠాలు చెప్పిన గురువులను పూలమాలలు, శాలువాలతో సన్మానం చేశారు. ఒకరినొకరు ఆత్మీయ ఆలింగనం చేసుకొని ప్రస్తుతం చేస్తున్న పనుల గురించి చర్చించుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. కార్యక్రమంలో గురువులు బాలకుమార్, సరస్వతీ, అయిలయ్య, కిషన్, లక్ష్మారెడ్డి, అంబదాస్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



బచ్చన్నపేట : గురువులతో పూర్వవిద్యార్థులు



దేవరుప్పుల : కడవెండి హైస్కూల్‌లో..

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్సీ పరామర్శ

చిల్పూరు: మండలంలోని లింగంపల్లి(కొమ్ముగుట్ట)కి చెందిన కుమారస్వామి ఇటీవల తాటిచెట్టుపై నుంచి కిందపడి మృతి చెందాడు. అలాగే మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ తోట రాజయ్య తల్లి కొమురమ్మ అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ కడియం శ్రీహరి ఆదివారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట సర్పంచ్‌లు మామిడాల లింగారెడ్డి, ఉద్దెమారి రాజ్‌కుమార్, లొడెం రజిత రవీందర్, ఏడునూరి రవీందర్, వైస్ ఎంపీపీ భూక్య సరితనర్సింహులు, మాచర్ల ప్రవీన్, డిష్ వెంకన్న, రాజ్‌మహ్మద్ తదితరులు ఉన్నారు.

కొండచిలువ హతం

బచ్చన్నపేట : మండలంలోని బండనాగారంలో వ్యవసా య బావి వద్ద కొందరు రైతులు కొండ చిలువను చంపేశారు. ఆదివారం ఉదయం గ్రామానికి చెందిన శివరాత్రి రాజనర్సు రైతు వ్యవసాయ బావి వద్ద బాటకు అడ్డంగా పడుకొని ఉన్న కొండచిలువను చుట్టుపక్కల రైతులు కలిసి చంపివేశారు. చిన్నచిన్న కొండచిలువ పిల్లలు కూడా కనిపిస్తున్నాయని, సిద్దుల గుట్ట దగ్గరగా ఉండడంతోనే కొండచిలువలు వస్తున్నాయని పలువురు రైతులు తెలి పారు. వ్యవసాయ బావుల వద్దకు రాత్రివేళ వెళ్లేవారు తగు జాగ్రత్తలను పాటించాలని సర్పంచ్ శివరాత్రి కవిత తెలిపారు.



నేడు జీపీ భవన నిర్మాణానికి భూమి పూజ

బచ్చన్నపేట : మండలంలోని గోపాల్‌నగర్‌లో నూతన గ్రామ పంచాయతీ కార్యాలయ నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి భూమి పూజ చేయనున్నట్లు సర్పంచ్ పర్వతం మధుప్రసాద్ తెలిపారు. ఈ భూమి పూజలో రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి, ఎంపీపీ బావండ్ల నాగజ్యోతి, నాయకులు, అధికారులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

బీఆర్ఎస్ గిరిజన మహిళా మండల అధ్యక్షురాలిగా భూమిక



ఎమ్మెల్యే రాజయ్యచే నియామకపు ప్రతిని అందుకుంటున్న భూమిక

రఘునాథపల్లి: బీఆర్ఎస్ మండల గిరిజన మహిళా అధ్యక్షురాలిగా మండలంలోని గిద్దబండతండాకు చెందిన భూక్యా భూమిక నియామకమయ్యారు. ఆదివారం ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య హన్మకొండలోని తన క్యాంపు కార్యాలయంలో భూమికకు నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేసేందుకు అవిశ్రాంతిగా కృషి చేస్తానన్నారు. అదే విధంగా గిద్దబండతండా యూత్ అధ్యక్షుడిగా భూక్య కుమార్‌ను ఎమ్మెల్యే రాజయ్య నియమించారు. వారి వెంట ఎంపీటీసీ బానోతు భిక్షపతినాయక్, బీఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి కొర్ర రాజేందర్‌నాయక్, కుర్ర కమలాకర్, గడ్డమీది సమ్మయ్య ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

లింగాలఘణపురం : మండలంలోని నెల్లుట్లకు చెందిన గొరిగె శ్రీనివాస్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా ముంబాయి కురుమ సంఘం, నెల్లుట్ల గ్రామ వాట్సప్ గ్రూపు నుంచి సేకరించిన రూ.లక్ష కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. కురుమ సంఘం రూ.50వేలు, నెల్లుట్ల వాట్సప్ గ్రూపు నుంచి రూ.50వేలు మొత్తం రూ.లక్ష మృతుడి కుటుంబానికి అందజేశారు. ముంబాయి బాంద్ర కురుమ సంఘం అధ్యక్షుడు గవ్వల చిన్నశ్రీనివాసు ఆధ్వర్యంలో గౌరవ అధ్యక్షుడు కుండె చంద్రయ్య, ఉపాధ్యక్షుడు చంద్రమౌళి, సభ్యులు రూ.50వేలు సమీకరించారు. స్థానిక కురుమ సంఘం నాయకులు బంద్రు నర్సింహులు, గొరిగె సంపత్, మొటికె సంపత్, చిన్న శ్రీనివాసు, మధు, సందీప్‌లు మరో రూ.50వేలు సమీకరించి కుటుంబ సభ్యులకు అందజేశారు.



ఆర్థికసాయం అందజేస్తున్న సంఘం సభ్యులు

వరుస చోరీలతో జనం బెంబేలు

చిల్పూరు : మొన్నటి వరకు ఎలాంటి భయం లేకుండా ఉన్న మండల ప్రజలు గత నాలుగు రోజులుగా గ్రామాల్లో చిల్లర దొంగతనాలతో కంటిమీద కునుకు లేకుండా జంకుతున్నారు. మండలంలోని కృష్ణాజీగూడెంలో రెండు రోజుల క్రితం జక్కుల లింగయ్య పత్తిని ఇంటి వెనుకకొట్టంలో నిల్వ ఉంచాడు. గుర్తుతెలియని వ్యక్తులు గోడ ఎక్కి పత్తిని ఎత్తుకెళ్లారు. అది మరువక ముందే శనివారం రాత్రి గ్రామ సమీపంలోని పెద్దమ్మ ఆలయ తాళాలు పగుల గొట్టి అందులో ఉన్న హుండీతో పాటు పది తులాల వెండి, అమ్మవారి వెండి కళ్లు ఎత్తుకెళ్లారు. హుండీని ఆలయ సమీపంలోని సాదం చంద్రయ్య బావి వద్ద పగులగొట్టి అందులో ఉన్న దాదాపు రూ.12 వేల వరకు అపహరించారని పోలు రఘు, ఊరడి శ్రీనివాస్, ఇట్టబోయిన రమేష్ తెలిపారు. చోరీకి వచ్చిన దొంగలు మొదట ఆలయంలో పూజలు చేసినట్లు పసుపు, కుంకుమతో ఆనవాళ్లు ఉన్నాయి. ప్రజలు ఏ ఊరికైనా తాళాలు వేసి వెళ్లాలంటే వెళ్లలేకపోతున్నారు. మండల కేంద్రంలోని గంగామాత ఆలయంలో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. హుండీని పగుల గొట్టి అందులో ఉన్న రూ. దాదాపు రూ.42 వేల నగదు, అమ్మవారి పుస్తె, మట్టెలు ఎత్తుకెళ్లినట్లు ఆవుల లింగయ్య తెలిపారు. ఈ విషయంపై ఇంత వరకు ఎవరూ ఫి ర్యాదు చేయలేదని ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు.

భూక్యా వనితకు ఘన సన్మానం

తరిగొప్పుల: తిరుపతి శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో శనివారం నిర్వహించిన జాతీయ పారంపర వైద్య మూడో సదస్సులో మండలంలోని కొత్తతండాకు చెందిన భూక్య వనిత ఆయుర్వేద వైద్య రంగంలో కొన్ని రోజులుగా సేవలందిస్తున్నందుకు, ఆమె చేస్తున్న కృషిని గుర్తించి హన్మకొండలోని మహర్షి గోశాల వ్యవస్థాపకుడు డాక్టర్ సర్జన రమేష్ చేతుల మీదుగా మెమొంటో, సర్టిఫికెట్ అందుకున్నారు.



మెమొంటో అందుకుంటున్న భూక్య వనిత